
ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 44 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 24 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## ప్రజ్వల్‌కు దేవెగౌడ హెచ్చరిక

పోలీసుల ఎదుట లొంగిపో.. లేదంటే నా ఆగ్రహానికి గురవుతావు

2లో..

# దళితులు, గిరిజనల రిజర్వేషన్లు యధాతథం

నా ప్రాణం ఉన్నంత వరకు వాటిని ఎవరూ లాగేసుకోలేరు

భారత్‌ను విభజించి రెండు ముస్లిం దేశాలు చేసిన కాంగ్రెస్

ముస్లిం ఓటు బ్యాంక్ కోసం ఇండియా కూటమి తహతహ

హర్యానా ప్రచారంలో ప్రధాని మోడీ ఉద్వేగ ప్రసంగం



చండీఘడ్, మే 23 (ప్రభాత ఉదయం): భారత్‌ను విభజించి రెండు ముస్లిం దేశాలు చేసిన కాంగ్రెస్ పార్టీ అంటూ ప్రధాని మోడీ ఘాటు విమర్శలు చేశారు. ముస్లిం ఓటు బ్యాంక్ కోసం ఇండియా కూటమి తహతహ లాడుతోందన్నారు. అయితే దళితులు, గిరిజనలు రిజర్వేషన్లు యధాతథంగా ఉంటాయని, తన ప్రాణం ఉన్నంత వరకు వాటిని ఎవరూ లాగేసుకోలేరని అన్నారు. హర్యానా ప్రచారంలో ప్రధాని మోడీ ఉద్వేగ ప్రసంగం చేశారు. తాను జీవించి ఉన్నంత వరకు దళితులు, గిరిజనుల రిజర్వేషన్లను ఎవరూ లాక్కోలేరని ప్రధాని మోడీ అన్నారు. రాజ్యాంగం కల్పించిన వారి హక్కులపై దుష్ప్రచారం చేయడం దారుణమని అన్నారు. హర్యానాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ రిజర్వేషన్లపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, ఇండియా కూటమి నాయకులు దేశం కన్నా వారి ఓటుబ్యాంకు ముఖ్యమని, ఈ వ్యక్తులు తమ ఓటు బ్యాంకు కోసం దేశాన్ని విభజించారని, వారు ఇండియాను విభజించి రెండు ముస్లిం దేశాలను సృష్టించారని అన్నారు. కలకత్తా హైకోర్టు 2010 తర్వాత జారీ అయిన ఓబీసీ సర్టిఫికేట్లను రద్దు చేసింది. ఈ విషయంలో పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మోడీ విరుచుకుపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో వారు రాత్రికి రాత్రే ముస్లింలకు, చొరబాటుదారులకు ఓబీసీ సర్టిఫికేట్లు జారీ చేశారు. గత

..మిగతా 2లో



## బుద్ధుని సందేశం ఇప్పుడు దేశానికి ఎంతో అవసరం

### బుద్ధపూర్ణిమ సందర్భంగా సీఎం రేవంత్ సందేశం

హైదరాబాద్, మే 23 (ప్రభాత ఉదయం): తెలంగాణలో బౌద్ధ భిక్షులకు తగిన గౌరవం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజ్యం, అధికారం ఉండి వాటిని కాదని 29 ఏళ్ల వయసులో శాంతి కోసం బుద్ధుడు ఆలోచించారన్నారు. రెండున్నర వేల సంవత్సరాలుగా బౌద్ధ సిద్ధాంతం నిలబడి ఉందని ఉద్ఘాటించారు. సికింద్రాబాద్‌లోని మహా బుద్ధ విహార్‌ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గొప్ప క్షేత్రాన్ని సందర్శించిన అనుభూతి కలిగిందని తెలిపారు.

ప్రతి పనిని ధ్యానంగా చేయాలన్న సూచనలో చాలా అర్థం ఉందని ఈ సూక్తిలో నుంచి ఎంతో స్ఫూర్తిని పొందారని చెప్పారు. ఏ పని అయినా తాను ఎంతో ధ్యానంగా చేస్తానని స్పష్టం చేశారు. ధ్యాన మందిరం కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ఒక పాఠశాలను నిర్వహించాలని తాను కోరుతున్నానని చెప్పారు. సమాజంలో అసహనం, అసూయ పెరిగిపోతున్నాయని అన్నారు. సమాజంలో స్పర్థలు, ఉద్వేగాలు పెరిగేలా వాతావరణం నెలకొని ఉందన్నారు. బుద్ధుని సందేశం దేశానికి ఇప్పుడు ఎంతో అవసరమన్నారు. బుద్ధుడి సందేశాన్ని సమాజంలో ప్రతి ఒక్కరికి చేరవేయడానికి అవసరమైన సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం మీది... అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

## ఛత్తీస్‌ఘడ్‌లో భారీ ఎన్‌కౌంటర్



### ఏడుకు చేరిన మృతుల సంఖ్య.. భారీగా ఆయుధాలు స్వాధీనం

బీజాపూర్, మే 23 (ప్రభాత ఉదయం): ఛత్తీస్‌గఢ్ అడవులు మరోసారి కాల్పులతో దద్దరిల్లాయి. మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లా, నారాయణపూర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సలైట్లు మరణించారు. భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంద్రావతి ఏరియా కమిటీ, నారాయణపూర్, దంతెవాడ, బస్తర్ జిల్లాలకు చెందిన డీఆర్జీ, బస్తర్గ్ ÷టైర్స్‌తో పాటు ఎస్టీఎఫ్ బృందాలపై కాల్పులు జరగడంతో

..మిగతా 2లో

## వచ్చే వారం సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ పర్యటన

2

## రివర్స్ గేర్‌లో రేవంత్ ప్రభుత్వం

### ఇచ్చిన హామీలు అమల్లో వెనుకంజ

కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ విమర్శలు



భూపాలపల్లి, మే 23 (ప్రభాత ఉదయం): సన్న బియ్యానికే మద్దతు ధర ఇస్తారట.. మన తెలంగాణాలో దొడ్డు బియ్యం ఎక్కువగా పండిస్తామని... పండించిన రైతుల పరిస్థితి ఎంటని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. వడ్లకు బోనస్ అని చెప్పి బోగస్ చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నేత మాజీ మంత్రి హరీష్ రావుకాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గురువారం భూపాలపల్లిలో పర్యటించిన ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి గ్రాడ్యుయేట్ ఎన్నిక జరిగినప్పుడల్లా మనమే గెలిచామని, బిట్స్ పిలానిలో గోల్డ్ మెడలిస్ట్ ఆయన రాకేష్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపిచ్చారు. కాంగ్రెస్

..మిగతా 2లో

## జూన్ 5 తరవాత బీఆర్ఎస్ దుకాణం బంద్

కార్యకర్తలే పార్టీ నేతలపై తిరగబడతారు

రాష్ట్ర సంపదను దోచుకుని చిప్పచేతికి ఇచ్చారు

కవితపై 8వేల పేజీల చార్జిషీట్‌కు సమాధానం చెప్పండి

కెటిఆర్ నోరు అదుపులో పెటుకోకుంటే ఖబర్దార్

మంత్రి కోమటిరెడ్డి ఘాటు విమర్శలు

హైదరాబాద్,మే23(ఆర్ఎన్ఎ): ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జూన్ 5 తర్వాత భారాస దుకాణం మూతపడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం భారాస నేతలను ఆ పార్టీ కార్యకర్తలే వెంటపడి కొడతారన్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సంపదనంతా దోచుకున్నది చాలక కేసీఆర్ కుటుంబం దిల్లీకి వెళ్లింది. అవినీతి చేయకుండానే భారాస ఎమ్మెల్సీ కవితపై 8 వేల పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పుల ఖజానా మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. ఇకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరోసారి తమ ముఖ్యమంత్రి రేవంత్‌ని తిడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. కేటీఆర్ బచ్చా అని.. తండ్రి పేరు చెప్పుకుని మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. కానీ, రేవంత్ రెడ్డి

..మిగతా 2లో



## ఎన్నికలపై ఉన్న ధ్యాస.. ధాన్యం కొనుగోళ్లపై ఏదీ?



### ధాన్యం సేకరణ నత్తనడకన సాగడం దారుణం

### బీబీనగర్‌లో ఐకెపి కేంద్రాలు పరిశీలించిన కిషన్ రెడ్డి

భువనగిరి, మే 23 (ప్రభాత ఉదయం): సీఎం రేవంత్‌రెడ్డికి రైతులకంటే ఎన్నికలే ముఖ్యంగా మారాయని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ఐకేపీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని, 45 రోజులుగా ధాన్యం వస్తున్నా.. కొనుగోలు ప్రక్రియ వేగంగా జరగడం లేదని ఆరోపించారు. భువనగిరి నియోజకవర్గం బీబీనగర్ మండలంలోని రాఘవపూర్, రుద్రవెల్లి గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను కేంద్రమంత్రి గురువారం సందర్శించారు. కొనుగోళ్ల తీరుతోపాటు పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం కుప్పలను పరిశీలించారు. కొనుగోలు ఆలస్యం

..మిగతా 2లో

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు తుస్

## మహిళలకు బస్సు ప్రయాణం కూడా అనుమానమే
## ఉద్యోగుల నాలుగు డిఎలపై మాట్లాడడం లేదు
## ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డిని గెలిపిస్తే మండలిలో కొట్లాడుతాం
## హన్మకొండ సన్నాహక సభలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



హనుమకొండ,మే23(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఒకే ఒక హామీ మాత్రమే అమలైందని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ కూడా తుస్సేనని ఎద్దేవా చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా హన్మకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన పట్ట భద్రుల ఉప ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు నాలుగు డీఏలు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేసింది. అందుకోసం అసెంబ్లీ, కౌన్సిల్‌లో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా కలిసి పోరాడతాం. అందుకు ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డిని గెలిపించాలని అన్నారు. నారాయణఖేడ్‌లో ఉపాధ్యాయులపై లాఠీఛార్జి చేసి కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. నిరుద్యోగ భృతి హామీపై నిలదీస్తే.. అలా చెప్పలేదని అసెంబ్లీలో భట్టి విక్రమార్క అంటున్నారు. కరెంటు బిల్లులు, భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచడానికి సిద్ధమవుతున్నారు. ఒక వైపు సంక్షేమానికి కోతలు.. మరో వైపు వాతలా? అన్ని వర్గాలను మోసం చేయడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయింది. అందుకే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబితే కాంగ్రెస్ దారికొస్తుందని హరీశ్‌రావు అన్నారు. పట్ట భద్రుల సీట్ బీఆర్ఎస్ సొంతం చేసుకుంటుందని హరీష్ రావు అన్నారు. రాకేష్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ప్రచారం చేయాలి. ఎమ్మెల్యే స్థానంలో ఎమ్మెల్సీ గెలిపించాలి. కాంగ్రెస్ పాలనలోఉచిత బస్సు పథకం తప్ప అన్నీ తుస్. ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది. రైతాంగాన్ని నిలువునా మోసం చేసింది. ఇందిరమ్మ ఇల్లు, పింఛన్, అమలు చేసుడు విస్మరించింది. విద్యార్థి, నిరుద్యోగుల, ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ కు ఓటు తో బుద్ధి చెప్పాలి. ఉపాధ్యాయులపై నారాయణ ఖేడ్ లో లాఠీ ఛార్జి చేయడం సిగ్గు చేటు. వడ్లకు బోనస్ ఎగ్గొట్టిన కాంగ్రెస్ రైతు బిడ్డలు బుద్ధి చెప్పండి. సంక్షేమ పథకాలలో కోతలు, ధరలు పెంచి వాత పెడుతున్న రేవంత్ కు విద్యావంతులు బుద్ధి చెప్పాలని ఆయన వ్యాఖ్యానించారు. తీన్మార్ మల్లన్న గొంతు ఎందుకు మూగబోయింది. ప్రశ్నించే గొంతు రాకేష్ రెడ్డికి పట్టభద్రులు ఓటు వేయాలి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచిన బీజేపీ కి వాత పెట్టాలి. తెలంగాణ వాణి వినిపించాలంటే బీఆర్ఎస్ ను బలపర్చాలి. తెలంగాణ ఉద్యమ కార్లపై తుపాకీ ఎక్కు పెట్టిన రేవంత్ కు పట్ట భద్రులు ఓటు వేయొద్దు. హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని కుట్రలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వంకు గుణపాఠం చెప్పాలని అన్నారు. తెలంగాణ నీళ్లు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలించాలని బీజేపీ కుట్రలకు కాంగ్రెస్ వత్తాసు పలుకుతోంది. 2వేల పడకల ఆసుపత్రి చివరి దశకు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలంగాణ చిహ్నం ను తొలగించాలని కుట్రలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో పంటలు కోనేటోళ్ళు లేరు, కరెంట్ సరఫరాలో విఫలమయ్యారు. కాంగ్రెస్ అబద్దాలు, మోసాలను ప్రశ్నించడం రాకేష్ రెడ్డికి సాధ్యమని హరీష్ రావు పేర్కొన్నారు.



# వచ్చే వారం సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ పర్యటన

హైదరాబాద్, మే 23 (ప్రభాత ఉదయం): మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న మధ్యంతర పనులను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే వారం రానున్నారు. తన పర్యటనకు ముందు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం నీటిపారుదల శాఖ అధికారులు, మేడిగడ్డ బ్యారేజీ పనులను చేపట్టిన ఎల్అండ్‌టీ ప్రతినిధులతో సమీక్షించారు. మేడిగడ్డ బ్యారేజీపై మధ్యంతర చర్యల అమలుకు సంబంధించిన ఎన్‌డీఎస్ఏ సిఫార్సులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తాను ముఖ్యమంత్రితో కలిసి బ్యారేజీ వద్దకు వస్తానని చెప్పారు. అయితే.. వానాకాలం లోపు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు చేయాలనే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎసఏ) మధ్యంతర నివేదికపై శనివారం మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. కేంద్ర జల వనరులసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఎన్‌డీఎసఏ నిపుణుల కమిటీ మూడు బ్యారేజీలకు వర్షాకాలం ప్రారంభానికి ముందు అత్యవసరంగా చేపట్టాల్సిన తాత్కాలిక మరమ్మతులు, తదుపరి అధ్యయనాలను సిఫారసు చేస్తూ గతంలో నివేదిక అందించింది. దీనిప్రకారం ఇప్పటికిప్పుడు మరమ్మతులు చేయడానికి రూ.100 కోట్ల దాకా అవుతుందని లెక్కలు కట్టారు. అయితే, నిధులు వెచ్చించినా ముమ్మందు మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినదని కచ్చితంగా చెప్పలేమంటూ ఇచ్చిన నివేదికల నేపథ్యంలో తదుపరి ఏం చర్యలు చేపట్టాలనే దానిపై మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోనున్నారు.




# దళితులు, గిరిజనల రిజర్వేషన్లు యధాతథం

మొదటి పేజీ తరువాయి...

10-12 ఏళ్లలో ముస్లింలకు జారీ చేసిన అన్ని ఓబీసీ సర్టిఫికేట్లను హైకోర్టు రద్దు చేసింది. కలకత్తా హైకోర్టు నిర్ణయాన్ని సీఎం మమతా బెనర్జీ అంగీకరించడం లేదని, వారు ఓబీసీ రిజర్వేషన్లను ముస్లింలకు ఇవ్వాలని కోరుకుంటున్నారు. ఇది ఇండియా కూటమి మనస్తత్వం అని ప్రధాని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, టీఎంసీ, ఇతర ఇండియా కూటమికి చెందిన పార్టీలు వారి ఓటు బ్యాంకుకు మద్దతు ఇస్తున్నాయని, అయితే మోడీ జీవించి ఉన్నంత వరకు దళితులు, గిరిజనుల రిజర్వేషన్లను ఎవరూ లాక్కోలేరని మీకు భరోసా ఇస్తున్నానని మోడీ అన్నారు. ఇది రాజకీయ ప్రసంగం కాదని, అణగారిన వారి హక్కులకు తాను ఇచ్చే హామీ అని అన్నారు. 2010 తర్వాత పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని ఓబీసీ సర్టిఫికేట్లను కలకత్తా హైకోర్టు బుధవారం రద్దు చేసింది. 1993 చట్టం ప్రకారం క్షఃఅల కొత్త జాబితాను సిద్ధం చేయాలని పశ్చిమ బెంగాల్ వెనుకబడిన తరగతుల కమిషన్‌ను కోర్టు ఆదేశించింది. దాదాపుగా 5 లక్షల ఓబీసీ సర్టిఫికేట్లు రద్దయ్యాయి. 2010 తర్వాత ఓబీసీ కోటా కింద ఉద్యోగాల్లో ఉన్నవారు, వాటిని పొందే పక్రియలో ఉన్న వారు కోటా నుంచి మినహాయింపబడరు. వారి ఉద్యోగాలపై ఎలాంటి ప్రభావం ఉండదు. కలకత్తా హైకోర్టు తీర్పు తర్వాత, ఈ తీర్పును అంగీకరించ బోమని సీఎం మమతా బెనర్జీ అన్నారు.

# రివర్స్ గేర్‌లో రేవంత్ ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్నీ తుస్సుమన్నాయని, కాంగ్రెస్ ప్రచారంలో 6 గ్యారంటీల్లో ఐదు అమలు చేసినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారని, జాబ్ క్యాలెండర్ పత్తా లేకుండా పోయిందని హరీష్ రావు విమర్శించారు. ఉపాధ్యాయుల మీద లాఠీ ఛార్జ్ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు పెంచిందని, మహిళా గ్రాడ్యుయేట్‌లు కూడా బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తున్నారన్నారు. మహిళా పథకం కింద వారికి నెలకు రూ. 2,500 ఇస్తాం అని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. నిన్న వరంగల్ ఎంజీఎంలో కరెంట్ పోయిందన్నారు. విద్యుత్ ఉద్యోగులను కూడా ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని హరీష్ రావు పేర్కొన్నారు.



# ఛత్తీస్‌ఘడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

మొదటి పేజీ తరువాయి...

ఎన్‌కౌంటర్ మొదలైంది. ఇప్పటికే ఏడుగురు నక్సల్స్ మరణించగా, 12 మంది నక్సలైట్లు గాయపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉంది. నారాయణపూర్ బీజాపూర్ జిల్లా సరిహద్దుల్లో ఎలాటూన్ నంబర్ 16, ఇంద్రావతి ఏరియా కమిటీకి చెందిన నక్సలైట్లు సంచరిస్తున్నారనే సమాచారంతో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ సమయంలోనే ఇరు వర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 100కు పైగా నక్సలైట్లు ఎన్‌కౌంటర్లలో మరణించారు. రెండు వారాల క్రితం బీజాపూర్ పిడియా గ్రామ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మరణించారు. అంతకుముందు ఏప్రిల్ 16న కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 29 మంది నక్సలైట్లు మరణించారు.

# ప్రజ్వల్‌కు దేవెగౌడ హెచ్చరిక

## పోలీసుల ఎదుట లొంగిపో.. లేదంటే నా ఆగ్రహానికి గురవుతావు

కర్ణాటక, మే 23 (ప్రభాత ఉదయం): కర్ణాటక సెక్స్ స్కాండల్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన మనవడు ప్రజ్వల్ రేవణ్ణకు మాజీ ప్రధాని దేవెగౌడ గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఎక్కడున్నా వెంటనే భారత్‌కు తిరిగి వచ్చి పోలీసుల ఎదుట లొంగిపోవాలని కోరారు. లేదంటే తన ఆగ్రహానికి గురికాక తప్పదంటూ ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా గట్టిగా హెచ్చరించారు. ఈ మేరకు 'ప్రజ్వల్ రేవణ్ణకు ఇదే నా హెచ్చరిక' పేరుతో ఓ లేఖను కూడా పోస్టుకు జతచేశారు. 'నా సహనాన్ని పరీక్షించొద్దు. ఎక్కడున్నా వెంటనే భారత్‌కు తిరిగి రావాలి. పోలీసుల ఎదుట లొంగిపోయి చట్టపరమైన విచారణను ఎదుర్కోవాల్సిందిగా.. ప్రజ్వల్‌ను నేను హెచ్చరిస్తున్నాను. లేదంటే నా ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుంది' అని దేవె గౌడ ఎక్స్‌లో పేర్కొన్నారు. మే 18న స్థానిక ఆలయానికి వెళ్లినప్పుడు ప్రజ్వల్ రేవణ్ణ గురించి మీడియాతో మాట్లాడినట్లు దేవె గౌడ తన లేఖలో పేర్కొన్నారు. ప్రజ్వల్ చేసిన పని తనకు, తన కుటుంబానికి, సహచరులను, స్నేహితులను, పార్టీ కార్యకర్తలను షాక్‌కు గురిచేసినట్లు చెప్పారు. దాన్నుంచి కోలుకోవడానికి కొంత సమయం పట్టిందన్నారు. అతని ఫారెన్ ట్రిప్‌కు సంబంధించిన సమాచారం తనకు పూర్తిగా తెలియదని దేవెగౌడ పేర్కొన్నారు. ఏది ఏమైనా వెంటనే భారత్‌కు తిరిగి వచ్చి పోలీసుల ఎదుట లొంగిపోవాలన్నారు. ఇది విజ్ఞప్తి కాదని, ఇది ప్రజ్వల్‌కు తాను చేస్తున్న హెచ్చరిక అని లేఖలో దేవెగౌడ పేర్కొన్నారు. ఏప్రిల్ 26న జరిగిన కర్ణాటక లోక్‌సభ ఎన్నికల తొలి దశకు ముందు ప్రజ్వల్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అతను విదేశాలకు పారిపోయాడు. దీంతో పోలీసులు ప్రజ్వల్‌పై అరెస్ట్ వారెంట్ కూడా జారీ చేశారు. దీంతో వారం రోజుల్లో భారత్‌కు వస్తానని ప్రజ్వల్ ఎక్స్ వేదికగా స్పందించారు. అయితే, ఇప్పటి వరకూ అతడు భారత్‌కు తిరిగిరాలేదు. దీంతో ప్రజ్వల్ దౌత్య పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని కర్ణాటక ప్రభుత్వం కేంద్రానికి లేఖ కూడా రాసింది. లైంగిక ఆరోపణల కేసులో ప్రజ్వల్ రేవణ్ణపై ఇప్పటికే న్యాయస్థానం అరెస్ట్ వారెంట్‌ను జారీ చేసిందని, ఈ క్రమంలో వెంటనే అతడి దౌత్య పాస్‌పోర్టును రద్దు చేయాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు కుమారస్వామి సైతం ప్రజ్వల్‌కు ఇటీవలే కీలక విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. తనపై, హెచ్‌డీ దేవెగౌడపై ఏమాత్రం గౌరవం ఉన్నా 48 గంటల్లో స్వదేశానికి తిరిగి వచ్చి సిట్ ఎదుట లొంగిపోవాలని కోరారు. 'ఎక్కడున్నా భారత్‌కు తిరిగొచ్చి విచారణకు హాజరవ్వు. తప్పించుకోవద్దని నేను అభ్యర్థిస్తున్నాను. ఏ తప్పూ చేయకపోతే.. ఎందుకు భయపడుతున్నావ్? ఎన్ని రోజులు దొంగా పోలీసు ఆట ఆడుతావు..? విదేశం నుంచి వచ్చి విచారణకు సహకరించు' అని విజ్ఞప్తి చేశారు.



# ఎన్నికలపై ఉన్న ధ్యాస.. ధాన్యం కొనుగోళ్లపై ఏదీ?

మొదటి పేజీ తరువాయి...

కావడానికి గల కారణాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ పక్రియ నత్తనడకన సాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గతంలో ఈ విషయంలో భారాస మోసం చేసింది. అదే దారిలో హస్తం పార్టీ నడుస్తోంది. రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరి' అన్నారు. దొడ్డు వడ్లు సాగు చేస్తే బోనస్ ఇవ్వబోమని ఇప్పుడు రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అన్నదాతలకు రుణమాఫీ లేదు.. బోనస్ లేదు. కాంగ్రెస్ సర్కారు తీరుతో బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. దేవుడి మీద ఒట్టు పెడితే వ్యవసాయదారులకు న్యాయం జరగదు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతి గింజ కొనడానికి సిద్ధంగా ఉంది' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల్లో వ్యతిరేకతను మూటగట్టుకునేందుకు భారాసకు పదేళ్లు పడితే... కాంగ్రెస్‌కు 5 నెలలే పట్టింది. దొడ్డు వడ్ల రైతులకు అన్యాయం చేస్తే భాజపా సహించదు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలి. రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి. బ్యాంకర్లు రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ నెరవేర్చలేదు. కానీ, ఆ పార్టీ నేతలు దిల్లీకి సూట్‌కేస్‌లు మోసుకెళ్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే గద్దె దిగాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి వెంట భాజపా జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, భాజాపా ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, కిసాన్ మోర్చా నాయకులు గోలీ మధుసూదన్ రెడ్డి, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, పడమటి జగన్మోహన్ రెడ్డి, ఎన్నం శివకుమార్, తదితరులు ఉన్నారు.

# జూన్ 5 తరవాత బీఆర్ఎస్ దుకాణం బంద్



మొదటి పేజీ తరువాయి...

ఇండిపెండెంట్‌గా గెలిచి లీడర్ అయ్యారని పేర్కొన్నారు. రేవంత్ వయసులో పోలిస్తే కేటీఆర్ చిన్న పిల్లాడు అని వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డి పొట్ట కొట్టి కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల రిజల్ట్స్ తరువాత బీఆర్ఎస్ భూస్థాపితం అవడం ఖాయం అని అన్నారు. మేడిగడ్డ మాదిరిగానే బీఆర్ఎస్ పార్టీ కూలిపోవడం ఖాయం అన్నారు. కేసీఆర్ కూతురు కవిత చేసిన పనికి రాష్ట్రం పరువు పోతోందని వ్యాఖ్యానించారు. 5వ తేదీ నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలే కేటీఆర్, హరీష్ రావునితరిమి కొడుతారని అన్నారు. నందినగర్ నుండి కారులో న్యూట్రల్‌లో వెళ్లినా అసెంబ్లీకి చేరుకోవచ్చునని.. కట్టే పట్టుకొని అసెంబ్లీకి రాలేదు కానీ, బీజేపీ కోసం కెసిఆర్ బస్సులో తిరిగారని కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. అసలు తెలంగాణ కోసం కొట్లాడింది తామేనని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి రెండు మూడు స్థానాల్లో డిపాజిట్ వస్తుందని.. అన్ని స్థానాల్లో ఓడిపోతుందని మంత్రి కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. 12 రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ లేకుండా పోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి లీడర్, క్యాడర్ లేకుండా పోతారని అన్నారు. 5వ తేది తర్వాత తెలంగాణ భవన్‌కి తాళం వేసుకోవాల్సి వస్తుందన్నారు. కవితకు బెయిల్ రావట్లేదని కేటీఆర్ పూర్తిగా ఫ్రస్టేషన్‌లోకి వెళ్లారని.. అందుకే ఇష్టారీతిన తమ ప్రభుత్వంపై కారుకూతలు కూస్తున్నారంటూ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ఇస్తున్నందుకు మా రేవంత్‌ని తిడుతున్నావా? 500 రూపాయలకు సిలిండర్, ఉచిత విద్యుత్ ఇవ్వడమే మేం చేస్తున్న పాపమా? హాస్టల్స్, పేదవారికి ఇచ్చే ఉచిత బియ్యం పూర్తిగా సన్నబియ్యం ఇద్దామనుకోవడం తప్పా? మేం ఇచ్చిన నోటిఫికేషన్ కాంగ్రెస్ క్లెయిమ్ చేసుకుంటుంది అంటున్నావ్. మరి మీరే ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మా ముందు చూపుతోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. కేసీఆర్ చేసిన పనికి మూడు డ్యాములు కొట్టుకొని పోయే ప్రమాదం ఉందని నిపుణులు చెప్తున్నారు. కాళేశ్వరం పేరుతో కోట్ల రూపాయలు వృధా చేశారు. వైన్ షాపుల పేరు మీద కేసీఆర్ నాన్ రిఫండబుల్ పైసలు గుంజిండు. ఏకకాలంలో రుణమాఫీ చేయబోతున్నాం. మల్లన్నపై కేసులు ఉన్నాయని అంటున్నావ్.. మీ చెల్లిపై 8000 పేజీల ఛార్జ్ షీట్ పై ఏమంటావ్ కేటీఆర్? మహేశ్వర్ రెడ్డి ఏం పైరవీ చేసుకొని పదవి తెచ్చుకున్నారు? ఆయన పేరు పలకాలంటే సిగ్గుగా ఉంది?' అని కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. తెలంగాణ బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఈ డిపార్ట్‌మెంట్‌కి వెళ్లినా మహేశ్వర్ రెడ్డి ఆర్టీఐ అప్లికేషన్లే ఉంటున్నాయని అన్నారు. బ్లాక్ మెయిల్ చేసి పైసలు సంపాదించాలని మహేశ్వర్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. ఆర్టీఐలు కోరుతున్న మహేశ్వర్ రెడ్డి.. నిర్మల్ నియోజకవర్గానికి ఏం కావాలని ఒక్కసారైనా అడిగారా? అని మంత్రి ప్రశ్నించారు. ఇకపోతే జిల్లాల్లో మున్సిపాలిటీల అనుమతులు లేకుండానే భారాస కార్యాలయాలు నిర్మించారు. ప్రభుత్వ ఆస్పత్రుల భవనాలు 14 అంతస్తులు మించరాదని నిబంధనలు చెబుతున్నాయి. ఎల్బీనగర్ ఆస్పత్రి స్థలానికి ఎన్‌వోసీ లేకుండా నిర్మాణం చేపట్టారు. అందెశ్రీ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించాలని గత ప్రభుత్వాన్ని కోరాం. ఆడిటోరియానికి కాళోజీ పేరు పెట్టాలంటే పెట్టలేదు. నల్గొండ జిల్లాకు ఎస్ఎల్‌బీసీ సొరంగం మంజూరు చేయిస్తే.. భారాస ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శలు చేశారు. ఇచ్చిన హామీలను ప్రాధాన్య క్రమంలో నెరవేర్చుకుంటూ వెళుతున్నామని, వేసవిలో వడగళ్ల వాన కారణంగా పంటనష్టం జరిగితే రైతులకు రూ.1500 కోట్ల పరిహారం చెల్లించినట్లు వెల్లడించారు.

## స్విమ్మింగ్‌లో ఐదు పథకాలు సాధించిన
# హైదర్‌గూడ వాసి గంగిడి పుల్లారెడ్డి

రాజేంద్రనగర్, మే23(ప్రభాత ఉదయం) : సికింద్రాబాద్ లో జరుగుతున్న స్విమ్మింగ్ పోటీలలో హైదర్ గూడ కు చెందిన 52 సంవత్సరాల గంగిడి పుల్లారెడ్డి సత్తా చాటారు. 400 మీటర్ల మెడ్లీ స్విమ్మింగ్ పోటీలలో మొదటి స్థానంలో నిలిచారు. పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ (ఆర్) సౌజన్యంతో మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ కు ఎదురుగా ఉన్న బీవీ గురుమూర్తి ( జీహెచ్ఎంసీ) స్విమ్మింగ్ పూల్ లో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరుగుతున్న ఫస్ట్ ఫెడరేషన్ కప్ నేషనల్ మాస్టర్స్ గేమ్స్ - 2024లో పాల్గొన్న హైదర్ గూడ కు చెందిన గంగిడి పుల్లారెడ్డి పలు విభాగాలలో పథకాలు సాధించారు. బుధవారం జరిగిన 400 మీటర్ల స్విమ్మింగ్ లో మొదటి స్థానం , 400 మీటర్ల మెడ్లీ రిలే స్విమ్మింగ్ లో ప్రథమ స్థానంలో నిలిచారు. బ్రేస్ట్ స్ట్రోక్ 200 మీటర్ల లో మొదటి స్థానం , బటర్ ఫ్లై 100 మీటర్ల స్విమ్మింగ్ లో మొదటి స్థానం , ఫ్రీ స్టైల్ 200 మీటర్ల స్విమ్మింగ్ లో ద్వితీయ స్థానంలో పథకాలు సాధించారు . బుధవారం జరిగిన 50 మీటర్ల ఫ్రీ స్టైల్ స్విమ్మింగ్ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచారు . స్విమ్మింగ్ లో పథకాలు సాధించిన పుల్లారెడ్డి ని నిర్వాహకులు జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ లు మెడల్స్ తో పాటు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా హైదర్ గూడ, కూడా అత్తాపూర్ కు చెందిన స్నేహితులు , క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు గంగిడి పుల్లారెడ్డిని అభినందనలతో ముంచెత్తారు. 52 సంవత్సరాల వయసులో స్విమ్మింగ్ లో గంగిడి పుల్లారెడ్డి రాణించి ఐదు పథకాలు గెలుచుకోవడం సంతోషకరమన్నారు.



గంగిడి పుల్లారెడ్డి కి మెడల్ తో పాటు సర్టిఫికెట్ అందజేస్తున్న జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ లు



హాస్పిటల్‌లో రోగులను వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

## పేదలకు నాణ్యమైన
# వైద్యం అందేలా చర్యలు చేపట్టాలి
### సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 23(ప్రభాత ఉదయం)జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, గురువారం జిల్లా ఆసుపత్రిని సందర్శించి ఇన్చార్జి సూపరింటెండెంట్ నవీన్ క్రాంతి తో మాట్లాడి రోగులను కలిసి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా ఆసుపత్రిలో రోగులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు లేవని అన్నారు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, కొందరు సిబ్బంది నిర్లక్ష్యం బాధ్యతరాహిత్యం వల్ల రోగులకు ప్రభుత్వ ఆసుపత్రి పై నమ్మకం పోతుందని అన్నారు ఆసుపత్రిలోని స్కానింగ్ మిషన్లు,ఫ్యాన్లు, జనరేటర్ మెయింటెనెన్స్ సరిగా లేకపోవడం వల్ల తరచుగా రిపేర్లకు వస్తున్నాయని దీని వల్ల రోగులు బయటకు వెళ్లి సొంత డబ్బులతో స్కానింగ్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఒకవేళ స్కానింగ్ ఇక్కడే చేసినా రిపోర్టులు సమయానికి ఇవ్వడం లేదని రోగులు తెలిపినట్లు చెప్పారు. కావలసిన మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని, త్రాగడానికి మంచినీళ్ళని సైతం బయట కొనుక్కోవలసిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. సెక్యూరిటీ నుండి వైద్యుని వరకు రోగులను, పేషంట్ల వెంట వచ్చిన వారిని చీదరించు కోవడమే కనిపిస్తుందని రోగుల పట్ల వైద్యులు సిబ్బంది వ్యవహరించే తీరు సరిగా లేదని సిబ్బంది వ్యవహరించే తీరు వల్ల ప్రభుత్వ ఆసుపత్రి పై ప్రజల్లో నమ్మకం పోతుందని అన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం అత్యంత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. చిన్న పిల్లల తల్లుల వార్డులో వాష్ రూమ్ లీకేజీ కారణంగా మూసివేశారని, జనరల్ ఫిమేల్ వార్డులో ఒకే బెడ్ పై ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తున్నారని కొందరి రోగులను ఆరు బయటనే ఉంచారని బెడ్ ల కొరత తీవ్రంగా ఉ ందని అన్నారు, 2022 సంవత్సరం నుండి ఇప్పటివరకు 76 లక్షల కరెంట్ బిల్లులు బకాయిలో ఉండటం ఆశ్చర్యకరమని అన్నారు, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐజకు చెందిన అరుణ అనే బాలింత, ఏప్రిల్ 19వ తేదీన సిజేరియన్ చేయించుకున్నదని వారం రోజుల తర్వాత ఇంటికి వెళ్లారని ఇన్ఫెక్షన్ అయినట్టుగా గమనించి మళ్లీ వెంటనే ఆసుపత్రికి వచ్చారని రెండు రోజులు ట్రీట్మెంట్ చేసి ఏమీ కాదు అని చెప్పి మళ్ళీ పంపించారని ఇంటికి వెళ్లిన తర్వాత నొప్పి తీవ్రం కావడంతో మళ్లీ ఆస్పత్రికి వచ్చారని ఆపరేషన్ అయిన బాలింతను ట్రీట్మెంట్ సరిగ్గా ఇవ్వకపోవడం వల్ల ఇన్ఫెక్షన్స్ అయిందని మూడవసారి ఆస్పత్రికి వచ్చినా డాక్టర్లు సరిగ్గా పట్టించుకోవడంలేదని పేషెంట్ తరపు బంధువులు తెలిపినట్లు చెప్పారు. దీన్నిబట్టి రోగుల పట్ల డాక్టర్లు వ్యవహరిస్తున్న తీరు ఏ విధంగా ఉందో అర్థం అవుతుందని అలాంటి డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్ పరిశీలించి వెళ్ళిన తర్వాత కూడా ఆసుపత్రిలో సిబ్బంది తీరు మారకపోవడం శోచనీయమని ఆసుపత్రి పై ఇన్ని రకాల ఆరోపణలు వస్తున్న క్రమంలో సూపరిండెంట్ గా ఉన్న డాక్టర్ కిషోర్ కుమార్ నెలరోజుల పాటు సెలవులో వెళ్ళటంలో ఉ న్న అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.ఆసుపత్రికి రోజు 400 మంది పేషెంట్లు వస్తుండగా సోమవారం లాంటి ప్రత్యేక రోజుల్లో 800 వరకు రోగులు వస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో సరిపడినంత మంది డాక్టర్లు,వైద్య సిబ్బంది లేకపోవడం వల్ల ఉన్న వారిపైనే పని ఒత్తిడి పెరుగుతోందని అన్ని రకాల వైద్యాలకు సరిపడినంత డాక్టర్లు లేకపోవడం వల్ల కాంట్రాక్టు సిబ్బందితోనే వైద్యం చేయిస్తున్నారని తెలిపారు. జనరల్ మెడిసిన్లో ఒక్క రెగ్యులర్ వైద్యుడు లేరని, జనరల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ జనరల్ మూడు పోస్టులు, అనస్తీసియాలో ఇద్దరు ఈ ఎన్ టి, ఆర్థోపెడిక్ లో ఒక్కరు రెగ్యులర్ వాళ్ళు లేరని ఆప్తమాలజిస్టు లో ఒకరు సైక్రియాటిస్టు రెండు పల్మనాలజిస్టు, డెంటల్,రేడియాలజీ దెర్మటాలజీలో ఒక్కరు లేరని హెడ్ నర్స్ లో ఏడు పోస్టులు స్టాఫ్ నర్స్ లో 43 పోస్టులు మిడ్ వైఫ్ లో రెండు ఏఎన్ఎంలో 8 ల్యాబ్ టెక్నీషియన్ ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఆసుపత్రిలోని 145 బెడ్స్ గానూ కేవలం 35 మంది మాత్రమే శానిటేషన్ సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు ఆసుపత్రిలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని వడ్డించే భోజనం క్వాలిటీ, క్వాంటిటీ రెండు తక్కువగా ఉన్నాయని అన్నారు, దీనివల్ల ఆసుపత్రిలోని రోగులు నిత్యాన్నదాన సత్రానికి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు సిబ్బంది నియామకంలో కూడా కోట్లాది రూపాయలు చేతులు మారినట్టు ఆరోపణలు వస్తున్నాయని ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా,స్క్రీనింగ్ కమిటీ లేకుండా నియామకాలు చేశారని విమర్శించారు. జిల్లా వైద్యాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అక్రమ పద్ధతిలో నియామకాలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. జిల్లాలో ప్రజా వైద్యంలో ఏకైక దిక్కుగా ఉన్న జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిపై జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, ఆసుపత్రి సూపరిండెంట్ పై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రికి కావలసిన వైద్య సిబ్బందిని డాక్టర్లను కావలసిన సౌకర్యాలను మెరుగుపరిచే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ఆస్పత్రిలో ఉన్న రోగులతో పాటు వారి వెంట ఉన్న సహాయకులకు కూడా భోజనం అందించాల్సిన కాంట్రాక్టర్ కేవలం రోగికి మాత్రమే అది కూడా నాణ్యతలేని భోజనం అందిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి నరసింహ, ఉప్పేర్ నరసింహ, నాయకులు రంగన్న, కళ్యాణ్ రాముడు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



# నేడు రాజేంద్రనగర్, శంషాబాద్, హిమాయత్ సాగర్, నార్సింగి ప్రాంతాలలో విద్యుత్ లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్, మే 23(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఉప్పరపల్లి ఫోర్టు వ్యూ కాలనీలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఫోర్ట్ వ్యూ కాలనీ, పరమారెడ్డి హిల్స్ హ్యాపీ హోమ్స్ కాలనీ అశోక్ విహార్ జనచైతన్య కాలనీ ప్రాంతాలు, హైదర్గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, ఎర్రబోడ , ఉప్పర్ పల్లి, హైదర్ గూడ,ప్రకాష్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హాథిరాం తెలిపారు.

### శివరాంపల్లి సెక్షన్ లో...

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని భవాని కాలనీ ప్రావిడెంట్ అపార్ట్మెంట్ ఆవరణలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో చెట్ల కొమ్మలను తొలగించడానికి ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు ఆదర్శ నగర్ , మంజుభార్, ఆరంగర్ పిస్తా హౌస్, కింగ్స్ శరణ్య, లక్ష్మీనారాయణ విల్లాస్, మెట్రో కన్వెన్షన్ ప్రాంతాలు, డ్రీమ్ వ్యాలీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుండి రెండున్నర గంటల వరకు నైజర్ ఫంక్షన్ హాల్, ఆరంగర్ పోలీస్ స్టేషన్ గల్లి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ చారి తెలిపారు.

### నేడు శంషాబాద్ లో విద్యుత్ సరఫరా లో అంతరాయం ...

శంషాబాద్ సబ్ స్టేషన్ పరిధిలోని చిన్న గోల్కొండ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు చిన్న గోల్కొండ బహదూర్ గూడ రషీద్ గూడ రాయికుంట సంఘీ కూడా హమీదుల్ల నగర్ ప్రాంతాలలో చెట్ల కొమ్మలను తొలగించడానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు.

### షాపూర్ సెక్షన్ పరిధిలో...

షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని కుటీరం విద్యుత్ ఫీడర్, పార్కింగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు చెట్ల కొమ్మలను తొలగించడానికి స్వర్ణ భారత్ ట్రస్ట్ జిమ్స్ హాస్పిటల్ జె బి ఎం గార్డెన్ ముచ్చింతల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈ విషయాన్ని వినియోగదారులు గమనించారని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు.

### నేడు హిమాయత్ సాగర్, నార్సింగి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత...

ఇబ్రహీం బాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సాయిరాం నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించడానికి శుక్రవారం ఉదయం 11 గంటల నుండి 12:30 వరకు సాయిరాం నగర్ కాలనీ సాయి హర్ష కాలనీ ప్రగతి హోమ్స్ విజేత సూపర్ మార్కెట్ స్నేహిత విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండున్నర గంటల వరకు స్నేహిత కాలనీ, కేకే నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడున్నర నుండి సాయంత్రం 5 గంటల వరకు కేకే వన్ కేకే టు ఫీల్ గుడ్ హోమ్ గంధంగూడ సాయి బాలాజీ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి శ్రీనివాస్ తెలిపారు.

### నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలో..

కోకాపేట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కోకాపేట్ గ్రామం ఇందిరమ్మ కాలనీ ఎడెన్ విలాస్ పోలోమి ఆస్ట్రియా ఫినిక్స్ గ్లోబల్ స్కూల్ 60 ఇయర్స్ శివాలయం ప్రాంతం నార్త్ స్టార్ విల్లాస్ గ్రామపంచాయతీ ఆఫీస్, కృష్ణ గోశాల విద్యుత్ ఫీడర్, మై హోమ్ తరక్ష విద్యుత్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి రెండు గంటల వరకు కృష్ణ గో సేవ ఎన్సిసి అర్బన్ 7 హిల్స్ రోడ్ అలేఖ్య హోమ్స్ ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్, రామ్ కి వన్ ప్రాంతాలు, అక్షయపాత్ర విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్న మూడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కోకాపేట్ స్కూల్ ,పైప్లైన్ రోడ్, అక్షయపాత్ర ఫౌండేషన్, ఓజీఎం రోడ్ ,వెరిటెక్స్ ,పనాచే ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నార్సింగి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి తెలిపారు .విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.




# నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్, మే 23(ప్రభాత ఉదయం) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెం టరీ పరీక్షలు శుక్రవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తారు. వార్షిక పరీక్షల్లోనూ విద్యా ర్థులకు ఇదే వెసులుబాటు కల్పించారు శుక్రవారం నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు ఉదయం 9:05 గంటలు, మధ్యాహ్నం 2 : 25గంటల వరకు వచ్చేవారిని పరీక్ష రాసేందుకు అనుమతి స్తారు. ఆ తర్వాత వచ్చేవారిని అస్సలు అనుమతించరు. జూన్ 3 వరకు జరిగే ఈ పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2 : 30 గంటల నుంచి సాయంత్రం 5 : 30 గంటల వరకు సెకండియర్ విద్యార్థులకు నిర్వహిస్తారు. మొత్తం 4.6 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయ నున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 900 పరీక్షాకేంద్రాలను ఇంటర్‌బోర్డు ఏర్పాటు చేసింది. విద్యార్థులు https://tsbie.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

# నకిలీ విత్తనాలతో రైతులకు నష్టం జరిగితే సహించేది లేదు


**వనపర్తి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి**

**నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై అధికారులు పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలి**

**రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు**



కొత్తకోట, మే 23(ప్రభాత ఉదయం) ఉమ్మడి పాలమూరు జిల్లాలో వచ్చే వానకాలం సాగు చేసే రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టప్రకారంగా అధికారులు పీడీ యాక్ట్ అమలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాసరెడ్డి కోరారు. గురువారం ఆయన ఓ ప్రకటనలో మార్కెట్లోకి నకిలీ విత్తనాలు నకిలీ పురుగు మందులు రాకుండా వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను కోరారు. నకిలీ విత్తనాలు విక్రయించేవారు , నకిలీ రసీదులు ఇచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనాలు ప్యాకెట్లలో కాకుండా లూసుగా దొరికే విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని ఆయన రైతులకు సూచించారు. విత్తనాలు అధికారికంగా గుర్తింపు పొందిన కంపెనీలను కొనుగోలు చేయాలన్నారు. రైతులు పంట చేతికందే వరకూ రసీదులు భద్రంగా పెట్టుకోవాలని ప్రభుత్వం నిషేధించిన బీటీ -3 పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితులలో డీలర్లు విక్రయించవద్దని, రైతులు కొనుగోలు చేయవద్దన్నారు. రైతులు కష్టపడి వ్యవసాయం చేస్తారని వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఎరువుల డీలర్లు విత్తనాలు, ఎరువులు వివరాలు ధరలను బోర్డుపై తప్పనిసరిగా పంచే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. నిషేధిత నకిలీ పత్తి విత్తనాలను అమాయక రైతులకు విక్రయిస్తున్నారని అలాంటి ముఠాలపై చర్యలు తీసుకోని నకిలీ విత్తనాల అమ్మి రైతులను మోసగిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించకుండ డీలర్లు విక్రయించాలని ఆయన కోరారు.



## నేడు పుప్పాల్ గూడలో
# విద్యుత్ సరఫరా నిలిపివేత

గండిపేట, మే23(ప్రభాత ఉదయం)పుప్పాల్ గూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి శుక్రవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఇబ్రహీం భాగ్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. సెక్రటేరియట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం11 నుండి 1 గంట వరకు సెక్రటేరియట్ కాలనీ, ఆదిత్య ఫోర్ట్ విల్లా నుండి చింత చెట్టు వరకు, పీజీ కాలేజ్ విద్యుత్ ఫీడర్ 2 నుండి 3 గంటల వరకు బయాత్ కాలనీ, తిరుమల హిల్స్, డాలర్ హిల్స్, పీజీ కాలనీ, పుప్పాలగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో 3నుండి 4 గంటల వరకు పుప్పాలగూడ పాత గ్రామం, దుర్గా నగర్, శివ నగర్, మారుతీ నగర్,అల్కాపూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో 4 నుండి 5గంటల వరకు కులీ కుతుబ్షా కాలనీ, కే ఎన్ ఆర్ హిల్స్, స్కైలా, డైమండ్ హిల్స్, పెంటయ్య నగర్, వినాయక్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

## మామిడికాయ పచ్చడి చేసిన
# మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి

**రంగారెడ్డి జిల్లా, మే23 (ప్రభాత ఉదయం) : సోదరి, మనువడు ఇంద్రతో కలిసి శ్రీనగర్ కాలనీలోని ఇంట్లో మాజీమంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆవకాయ పచ్చడిని తయారు చేసారు. ప్రతి ఏడాది స్వహస్తలతో పచ్చడి తయారు చేసే ఆనవాయితీని కొనసాగిస్తున్న సబితమ్మ.**



ఇంట్లో మామిడికాయ పచ్చడి తయారు చేస్తున్న మాజీమంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి



మామిడికాయ పచ్చడి చేస్తున్న సబితమ్మ తో మనుమడు ఇంద్రారెడ్డి



## ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన దినేశ్ కార్తీక్

ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఓడిపోయింది. రాజస్థాన్ రాయల్స్ చేతిలో 4 వికెట్ల తేడాతో ఓడిన ఆర్సీబీ భారంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. కాగా ఈ పరాజయం తర్వాత సీనియర్ ప్లేయర్, వికెట్ కీపర్ దినేష్ కార్తీక్ రిటైర్మెంట్ తీసుకున్నాడు. ఈ ఐపీఎల్‌లో ట్రోఫీని గెలుచుకోవడం ద్వారా ఆర్సీబీకి వీడ్కోలు పలకాలని దినేష్ కార్తీక్ ఆశించాడు. కానీ నిర్ణయాత్మక మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో ఆర్ఆర్ జట్టు 2వ క్వాలిఫయర్‌కు అర్హత సాధించింది. ఆర్సీబీ జట్టు ఐపీఎల్ నుంచి నిష్క్రమించింది. ఆ తర్వాత దినేష్ కార్తీక్ కూడా తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. దినేష్ కార్తీక్ తన 17 ఏళ్ల ఐపీఎల్ కెరీర్‌లో మొత్తం 6 జట్లకు ఆడాడు. 2013లో ముంబై ఇండియన్స్ తరఫున ట్రోఫీని గెలుచుకున్నాడు. ఆ తర్వాత పలు జట్లకు ఆడినా టైటిల్ గెలవలేకపోయాడు. ముఖ్యంగా ఆర్సీబీకి ట్రోఫీని అందించాలన్న డీకే కల కలగానే మిగిలిపోయింది.

## ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ
# సత్తా చాటడం కీలకం




ఐపీఎల్ 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. చెన్నైలోని చెపాక్ మైదానం వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగే క్వాలిఫయర్-2లో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టే ఆదివారం కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. దాంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. ఓవైపు కేకేఆర్‌తో క్వాలిఫయర్-1లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమి పాలవ్వగా.. మరోవైపు రాజస్థాన్ రాయల్స్.. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఆర్సీబీని ఓడించి రెట్టించిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. అంతేకాకుండా స్పిన్‌కు అనుకూలంగా ఉండే చెపాక్ మైదానానికి తగ్గట్లుగా రాజస్థాన్ రాయల్స్‌లో అద్భుత స్పిన్నర్లు ఉన్నారు. లోకల్ భాయ్ అశ్విన్‌తో పాటు యుజ్వేంద్ర చాహల్‌ను ఎదుర్కోవడం సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు బిగ్ ఛాలెంజ్. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే సన్‌రైజర్స్ హైదరాబాద్ స్థాయికి మించిన ప్రదర్శన చేయాలి. ముఖ్యంగా ఆ జట్టు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సత్తా చాటడం కీలకం. సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లలో ఈ ఇద్దరే కీలక పాత్ర పోషించారు. విధ్వంసకర బ్యాటింగ్‌తో రికార్డ్ విజయాలు అందించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ట్రావిస్ హెడ్(533, అభిషేక్ శర్మలే(470) టాప్ స్కోరర్లుగా కొనసాగుతున్నారు. చాహల్, బౌల్ట్, అశ్విన్ వంటి ప్రమాదకర బౌలర్లను ఎదుర్కొని భారీ స్కోర్ చేయాలంటే ఈ ఓపెనింగ్ జోడీ రాణించాల్సిందే. ఈ ఇద్దరితో పాటు హెన్రీచ్ క్లాసెన్(413) సత్తా చాటితే సన్‌రైజర్స్‌కు తిరుగు ఉండదు. రాహుల్ త్రిపాఠి, నితీష్ కుమార్ రెడ్డిలు తమ జోరును కొనసాగించాల్సి ఉంది. నితీష్ కుమార్ రెడ్డి రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 76లి పరుగులతో సత్తా చాటాడు. మరోసారి అతను అదే తరహా ప్రదర్శన కొనసాగిస్తే సన్‌రైజర్స్ బ్యాటింగ్‌కు తిరుగుండదు.
సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్‌లో ప్యాట్ కమిన్స్, భువనేశ్వర్ కుమార్, నటరాజన్ రాణిస్తున్నా ఇతర బౌలర్లను నుంచి సహకారం లభించడం లేదు. వానిందు హసరంగా స్థానంలో జట్టులోకి వచ్చిన విజయకాంత్ వియాస్కంత్ అంచనాలను అందుకోలేకపోతున్నాడు. అతని స్థానంలో గ్లేన్ ఫిలిప్స్‌ను తీసుకోవడం ఉత్తమం. సన్వీర్ సింగ్‌కు బదులు జయదేవ్ ఉనాద్కత్‌ను ఆడిస్తే బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ బలం పెరుగుతోంది. పవర్ ప్లేలోనే రాజస్థాన్ రాయల్స్ డేంజరస్ బ్యాటర్లు యశస్వి జైస్వాల్, సంజూ శాంసన్‌లను ఔట్ చేస్తే మ్యాచ్‌పై పట్టు చిక్కుతుంది. ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉన్న నేపథ్యంలో పకడ్బందీ ప్రణాళికలతో బరిలోకి దిగడం చాలా ముఖ్యం.



## బేబీజాన్‌లో కేక పుట్టించిన
# కీర్తి సురేశ్

మహానటి సినిమాతో తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది కీర్తిసురేశ్. ఈ సినిమాతో నేషనల్ అవార్డు అందుకున్న కీర్తిసురేశ్ బాలీవుడ్ యాక్టర్ వరుణ్ ధవన్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న బేబీజాన్‌లో వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోందని తెలిసిందే. కాగా ఈ మూవీలో కీర్తిసురేశ్ బోల్డ్ లిప్‌లాక్ సీన్‌లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్న వార్త ఒకటి బీటౌన్‌గా హాట్ టాపిక్‌గా మారింది. బేబీ జాన్‌లో వామికా గబ్బి మరో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని కోలీవుడ్ డైరెక్ట కాలీస్ డైరెక్ట్ చేస్తుండగా.. జవాన్ డైరెక్టర్ అట్లీ నిర్మిస్తున్నాడు. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీ నుంచి ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్ లుక్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తోంది. ఈ చిత్రాన్ని మే 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా.. సినీ1 స్టూడియోస్, జియో స్టూడియోస్‌తో కలిసి ప్రియాఅట్లీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బేబీజాన్ కీర్తిసురేశ్ బాలీవుడ్ డెబ్యూ సినిమా కావడం విశేషం. ఈ భామ ప్రస్తుతం తమిళంలో నాలుగు సినిమాల్లో నటిస్తోంది.

## కాజల్ సత్యభామ సినిమా జూన్ 7కు వాయిదా



మే 31న సుమారు అరడజనుకు పైగా సినిమాలు విడుదలవుతాయయనుకుంటున్న సమయంలో అందులో ఒక్కో సినిమా వాయిదా పడుతూ వస్తోంది. సుధీర్ బాబు నటించిన 'హరోం హర' మే 31న విడుదల కావాల్సి వుంది, కానీ ఇప్పుడు ఆ సినిమా జూన్ 14న విడుదలవుతుంది. ఇప్పుడు ఇంకో సినిమా కూడా విడుదల వాయిదా వేశారు. కాజల్ అగర్వాల్ పోలీసు పాత్రలో నటించిన 'సత్యభామ' సినిమా కూడా విడుదల వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ జూన్ 7 అని అధికారికంగా ప్రకటించారు. మే 31న ఎక్కువ సినిమాలు విడుదలకి ఉండటంతో, అందరితోపాటుగా ఎందుకు పోటీ అని జూన్ 7 కి ఈ 'సత్యభామ' ని వాయిదా వేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ సినిమా ప్రీ విడుదల వేడుక మాత్రం యధావిధిగా జరుగుతుందని చెపుతున్నారు. నందమూరి బాలకృష్ణ ప్రత్యేక అతిధిగా వచ్చి ఈ సినిమా ప్రీ విడుదల వేడుకలో పాల్గొంటారని చెప్పారు. 'భగవంత్ కేసరి' సినిమా విజయం తరువాత కాజల్ అగర్వాల్ చేస్తున్న సినిమా ఈ 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకుడు, నవీన్ చంద్ర ఒక ముఖ్యమైన పాత్రలో కనపడనున్నాడని తెలుస్తోంది. కాజల్ అగర్వాల్ ఇందులో ఒక పవర్ ఫుల్ పోలీసు పాత్రలో నటించింది. ఈ చిత్ర ప్రచారాలు విరివిగానే చేస్తున్నారు, కాజల్ ఈ సినిమాని తన వ్యక్తిగతంగా తీసుకొని మరీ ప్రచారాలు చేస్తున్నట్టుగా వినికిడి. 'మేజర్' లాంటి అద్భుతమైన సినిమాకి దర్శకత్వం వహించిన, శశికిరణ్ తిక్క ఈ సినిమాకి సమర్పకుడు, అలాగే కథనం కూడా అందిస్తున్నారు.




## బుజ్జితో ప్రయాణం
# ఎంతో ఆసక్తికరం
### అమితాబ్, కమల్ సర్‌లతో నటించడం అదృష్టం

బుజ్జితో కలిసి భైరవ చేసిన ప్రయాణం ఎంతో ఆసక్తికరం. ఈ పాత్రలతో మూడేళ్లు ప్రయాణం చేశా' అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కల్కి 2898 ఎ.డి'. దీపికా పదుకొణె కథానాయిక. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించారు. జూన్ 27న సినిమాని విడుదల చేస్తున్నారు. పురాణాలతో ముడిపడిన సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. ఇందులో భైరవ అనే పాత్రలో కనిపిస్తారు ప్రభాస్. బుజ్జి అనే పేరుతో కూడిన వాహనం కూడా కథలో కీలకం. బుజ్జి, భైరవ పాత్రల్ని పరిచయం చేస్తూ బుధవారం రాత్రి రామోజీ ఫిల్మ్‌సిటీలో ఓ వేడుకని నిర్వహించారు. బుజ్జి వాహనాన్ని నడుపుకుంటూ వేదిక మధ్యలోకి వచ్చి అభిమానుల్ని అలరించారు ప్రభాస్. ఇదే వేడుకలో 'బుజ్జి - భైరవ' టీజర్‌నీ ప్రదర్శించారు. 'ఇంక తిరిగి వెళ్లేదే లేదు...' అంటూ ప్రభాస్ చేసిన సందడి టీజర్‌కి ఆకర్షణగా నిలిచింది. అనంతరం వేడుకలో ప్రభాస్ మాట్లాడుతూ 'అమితాబ్... కమల్ హాసన్ నటనని చూసి భారతదేశం స్ఫూర్తి పొందింది. అలాంటి గొప్ప నటులతో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం. అమితాబ్ బచ్చన్‌లాంటి నటుడు మన దేశంలో ఉన్నందుకు గర్వపడుతున్నా. ఆయన స్ఫూర్తితోనే వచ్చాం మేమంతా. నా చిన్నప్పుడు కమల్‌హాసన్ సర్ నటించిన 'సాగరసంగమం' చూసి అలాంటి దుస్తులు కావాలని మా అమ్మని అడిగి తెప్పించుకున్నా. ఇందులో ఉన్న మరో అందమైన స్టార్ దీపికా పదుకొణె. ఆమెతో కలిసి పనిచేయడం మంచి అనుభవం. దిశా పటానీని హాట్ స్టార్ అంటుంటారు మా నిర్మాత స్వప్నదత్. నిర్మాత అశ్వనీదత్ ఈ వయసులోనూ శ్రమించే విధానం చూసి ఎంతో నేర్చుకోవాలనిపిస్తుంది. ఇంత ఖరీదైన సినిమా తీస్తూ కూడా, ఇంకా ఏం చేద్దాం అని అడుగుతుంటారు. ఇంత భారీ సినిమాలు తీస్తూ, ఇన్నేళ్లు పరిశ్రమలో ఉన్నది ఆయనొక్కరేనేమో. తన రెండో సినిమానే ఎన్టీఆర్‌తో చేశారంటే ఆయన స్థాయి ఏమిటో అర్థమవుతుంది. అంతే ధైర్యం, తపనతో పనిచేస్తుంటారు ఆయన కుమార్తెలు స్వప్న, ప్రియాంక. వాళ్లకీ, బుజ్జిని పరిచయం చేస్తున్న దర్శకుడు నాగ్ అశ్విన్‌కి కృతజ్ఞతలు. ఈ సినిమా కోసం నేనూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా అన్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'పేరు చిన్నదే కానీ, సినిమాలో బుజ్జి మామూలుగా ఉండదు. సినిమా తీయడమే కష్టం, ఈ సినిమా కోసం ఇంజినీరింగ్ కూడా చేయాల్సి వచ్చింది. భవిష్యత్తు కారు నేపథ్యంలో సినిమా అన్నప్పుడు డిజైన్ గురించి తర్జన భర్జన పడ్డాం. మహీంద్ర గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాకు ట్వీట్ చేశాక, ఆయన తన బృందాన్ని మాకు పరిచయం చేశారు. వాళ్లంతా చాలా సహకారం అందించారన్నారు. నిర్మాత సి.అశ్వనీదత్ మాట్లాడుతూ 'ఇది విడుదల తర్వాత చాలా పెద్ద సినిమా అవుతుంది అన్నారు.

## దేవర ఫియర్ సాంగ్‌కు
# 50 మిలియన్లకుపైగా వ్యూస్

జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ దేవర చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. పాన్ ఇండియా స్థాయిలో వస్తోన్న ఈ మూవీ రెండు భాగాలుగా విడుదల కానుండగా.. దేవర పార్టు 1 అక్టోబర్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా దేవర నుంచి ఇటీవలే ఫియర్ సాంగ్ ను లాంఛ్ చేశారు. అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన ఈ పాట నెట్టింట గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఫియర్ సాంగ్ యూట్యూబ్‌లో ఇప్పటిరకు 50 మిలియన్లకుపైగా వ్యూస్‌తో టాప్ వన్ ప్లేస్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఫిషింగ్ హార్బర్ విలేజ్, పోర్ట్ మాఫియా నేపథ్యంలో వస్తోన్న దేవర గ్లింప్స్ ఇప్పటికే నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ భామకు దేవర తెలుగు డెబ్యూ ప్రాజెక్ట్. దేవర పార్టు 1 డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. కాగా మేకర్స్ చాలా రోజుల క్రితం లాంఛ్ చేసిన దేవర ఒరిజినల్ సౌండ్ ట్రాక్ స్టన్నింగ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సెగలు పుట్టిస్తోంది. దేవరలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటిస్తుండగా.. ప్రకాశ్ రాజ్, ÷న్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ ఇతర కీ రోల్స్ పోషిస్తున్నారు. మల్టీ లింగ్యువల్ ప్రాజెక్టుగా వస్తోన్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.




## టిఎస్ పిఎస్సి గ్రూప్-1 సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

### గద్వాల జిల్లా కలెక్టర్ బిఎస్ సంతోష్
### జిల్లాలో 14 సెంటర్లలో 5,231 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 23(ప్రభాత ఉదయం)రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టిఎస్ పిఎస్ సి గ్రూప్-1 ప్రిలిమినరి పరీక్షను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న టీఎస్పీఎస్సీ గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షను ఎంతో జాగ్రత్తగా, పారదర్శకంగా, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలన్నారు. జూన్ 9వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించనున్న టీఎస్పీఎస్సీ గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా నుండి 5231 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, వారికోసం 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం 9:00 గంటల నుండి అభ్యర్థులకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని, 10:00 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలో ఎట్టి పరిస్థితిలో అనుమతించడం జరగదని తెలిపారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డు తో పాటు ఆధార్, ఓటర్ ఐడి, పాన్ కార్డ్ లాంటి గుర్తింపు కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ను తెచ్చుకోవాలని ప్రకటనలో కోరారు.పరీక్ష పకడ్బందీగా నిర్వహణ కోసం నలుగురు రూట్ ఆఫీసర్లను, నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు 51 మంది ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, 14 మంది డిపార్ట్మెంట్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టడం జరుగుతుందన్నారు. మరుగుదొడ్లు, త్రాగునీరు ఫాన్స్, లైట్స్, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్, బ్లూటూత్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని, డిపార్ట్మెంటల్ అధికారులు పరీక్ష రోజున ఉదయం 8.00 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటారని, పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రం నుండి ఎవరు కూడా బయటకు వెళ్లడానికి వీలు లేదన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి గుర్తింపు కార్డు లేకుండా ఎవరిని కూడ అనుమతించబడదని జిల్లా కలెక్టర్ బి ఎస్ సంతోష్ తెలిపారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.